సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం । 11 । మార్చి । 2024



బాలికల స్కూళ్లలో నిఘా నేత్రం

బాలికల స్కూళ్లలో సీసీ కెమేరాల ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రక్షణను దృష్టిలో పెట్టుకుని ఏర్పాటు చేశారు. 8లో



అప్పన్నకు ఆర్జిత సేవలు

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. స్వర్ణపుష్పార్చన వైభవంగా నిర్వహించారు. 8లో



ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు.

న్యూస్‌రీల్

బీరకాయ ఆకారంలో గుమ్మడి



ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో ఒక కూరగాయాల దుకాణం వద్ద బీరకాయ ఆకారంలో పొడవుగా ఉన్న గుమ్మడి కాయను చూసిన స్థానికులు ఆశ్చర్యపోయారు. ఈ గుమ్మడికాయ రెండు అడుగుల పొడవు ఉంది. ఈ విచిత్ర గుమ్మడికాయకు చాలా మంది ఫొటోలు తీసిన ఫేస్‌బుక్, వాట్సప్‌లలో అప్‌లోడ్ చేశారు.

వర్షంతో ఉపశమనం

సీలేరు/రాజవొమ్మంగి: జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం మధ్యాహ్నం తేలికపాటి వర్షం కురిసింది. వారం రోజులుగా తీవ్రమైన ఎండలతో ఇబ్బంది పడుతున్న ప్రజలు ఈ వర్షంతో ఉపశమనం పొందారు. సీలేరు, రాజవొమ్మంగి మండలంలో రాజవొమ్మంగితో పాటు బడదనాంపల్లి, లక్కవరప్పాడు, బొర్రంపేట తదితర గ్రామాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. రబీలో సాగు చేస్తున్న వైట్ బర్లీ పొగాకు తోటలకు, మామిడి, జీడిమామిడి తోటలకు ఈ వర్షం మేలు చేస్తుందని రైతులు తెలిపారు.

అనుమానాస్పదంగా మొసలి మృతి



గుంటవాడ రిజర్వాయర్ వద్ద మృతి చెందిన మొసలి

సీలేరు: ఆంధ్ర-ఒడిశా సరిహద్దు సీలేరు సమీప ఒడిశా ప్రాంతమైన గుంటవాడ జలాశయం వద్ద అనుమానాస్పదంగా ఓ మొసలి మృతి చెంది ఉంది. ఆదివారం ఉదయం గమనించిన కొంతమంది తెలిపిన సమాచారం మేరకు 4 అడుగుల పొడవున్న మొసలి ముఖంపై తీవ్రగాయాలున్నాయి. స్థానిక అటవీశాఖ అధికారులకు, ఒడిశాలో చిత్రకొండ అటవీశాఖ అధికారులకు సమాచారం తెలియడంతో వారు పరిశీలించి, సంయుక్తంగా పంచనామా నిర్వహించి, పూడ్చి పెట్టారు.

దుకాణాల ఏర్పాటుకు 13న బహిరంగ వేలం

ఎటపాక: మండలంలోని వెంకటరెడ్డిపేటలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 25న నిర్వహించనున్న స్వామి వారి కల్యాణమహోత్సవం సందర్భంగా తాత్కాలిక దుకాణాల ఏర్పాటుకు ఈనెల 13న బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు దేవదాయ శాఖ అధికారులు ఆదివారం తెలిపారు. 24 నుంచి 26వ తేదీ వరకు ఆలయం వద్ద తాత్కాలిక దుకాణాల ఏర్పాటుకు, కొబ్బరికాయలు, లడ్డు,పులిహోర ప్రసాద విక్రయానికి, తలనీలాలు, కొబ్బరి చిప్పలకు వేలంపాట నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆసక్తి గలవారు ధరావత్తు రూ.5 వేలు చెల్లించి ఆ రోజు ఉదయం 10 గంటలకు నిర్వహించే వేలంపాటలో పాల్గొనాలని కోరారు.

విశాఖలో ఐకాన్ స్టార్



గోపాలపట్నం(విశాఖ): ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ రాకతో విశాఖ విమానాశ్రయంలో ఆదివారం మధ్యాహ్నం సందడి నెలకొంది. షూటింగ్ కోసం విశాఖ వచ్చిన అభిమాన నటుడిని చూసేందుకు అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆయనతో ఫొటోలు, సెల్ఫీలు దిగేందుకు ఎగబడ్డారు. ఐకాన్ స్టార్.. పుష్ప.. అంటూ నినాదాలు చేశారు. హైదరాబాద్ నుంచి విమానంలో వచ్చిన ఆయన రోడ్డు మార్గంలో నగరంలోని ఓ హోటల్‌కి వెళ్లారు.

ఉద్యోగ యజ్ఞం

అడవి బిడ్డలకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా జిల్లాలో ఉద్యోగ యజ్ఞం నిర్విరామంగా సాగుతోంది. నిరుద్యోగ గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ధ్యేయంతో జిల్లా యంత్రాంగం చిత్తశుద్ధితో కృషి చేస్తోంది. శిక్షణ ఇచ్చి, అభ్యర్థులు నైపుణ్యం సంపాదించిన తరువాత పలు ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పించి, వారి కుటుంబాల్లో వెలుగులు నింపుతోంది.



హుకుంపేట మండలం తడిగిరి గ్రామానికి చెందిన పెనుమలి రవికిరణ్ పేద కుటుంబానికి చెందినవాడు. డిగ్రీ వరకు చదివినా సరైన ఉపాధి అవకాశాలు దొరకక నిరాశకు గురవుతున్న తరుణంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందాడు. దీంతో ఇతనికి విశాఖపట్నంలోని మౌరి టెక్ గ్లోబల్ ఎంటర్‌ప్రైజెస్ సొల్యూషన్స్ సంస్థలో ఏడాదికి రూ.1.45 లక్షల వేతనంతో ఉద్యోగం లభించడంతో ఆ పేద కుటుంబం కష్టాలు తీరినట్టయింది.

- స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా యువతకు శిక్షణ
- జాబ్‌మేళాలతో ఉపాధి కల్పన
- పేదల కుటుంబాల్లో వెలుగులు



అరకు స్కిల్‌హబ్‌లో టైలరింగ్ కోర్సు పూర్తిచేసిన మహిళలు

చింతూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిరుద్యోగ యువకులకు ఉపాధి కల్పించేందుకు విస్తృతంగా చర్యలు తీసుకుంది. గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతకు వృత్తి నైపుణ్యాలు పెంపొందించి, ఉద్యోగావకాశాలు కల్పించడమే లక్ష్యంగా స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలు పనిచేస్తున్నాయి.

స్కిల్ కళాశాల, హబ్‌ల ద్వారా శిక్షణ

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా అరకులో స్కిల్ కళాశాలను ఏర్పాటు చేశారు. ఈ కళాశాలలో ఏర్పాటు చేసిన యూత్ ట్రైనింగ్ సెంటర్ ద్వారా టూరిజం, హాస్పిటాలిటీ రంగం కింద ఫుడ్ అవుట్‌లెట్ మేనేజర్, హౌస్‌కీపింగ్ మేనేజర్ కోర్సుల్లో బ్యాచ్‌కు 30 మంది చొప్పున ఐదు, ఆరు నెలలు శిక్షణనిస్తున్నారు. జిల్లాలోని పాడేరు, రంపచోడవరం, అరకువ్యాలీలలో ఏర్పాటు చేసిన స్కిల్‌హబ్‌ల ద్వారా కూడా నిరుద్యోగ యువతకు శిక్షణనిస్తున్నారు. ఐటీ, ఆటోమోటివ్, హెల్త్‌కేర్ రంగాల కింద డొమెస్టిక్ డాటా ఎంట్రీ ఆపరేటర్, టూవీలర్ సర్వీస్ టెక్నీషియన్, జనరల్ డ్యూటీ అసిస్టెంట్, ఎలక్ట్రికల్ వెహికల్ మెయింటెనెన్స్ టెక్నీషియన్ వంటి కోర్సుల్లో ఇక్కడ శిక్షణనిస్తున్నారు.



అరకులోని స్కిల్ కళాశాలలో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులో శిక్షణ పొందుతున్న యువత

జాబ్‌మేళాల ద్వారా ఉపాధి

జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో మెగా, మినీ జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నారు. ఈ జాబ్‌మేళాల్లో ఆంధ్రా, తెలంగాణాకు చెందిన వివిధ కంపెనీలు పాల్గొని తమ సంస్థల్లో నియామకాలకు నిరుద్యోగ యువతను ఎంపిక చేసుకునేలా స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కృషి చేస్తోంది. దీనికోసం ఆయా ప్రాంతాల్లోని ఐటీడీఏలు, ఇతర శాఖల సమన్వయంతో జాబ్‌మేళాలు నిర్వహించి నిరుద్యోగ యువత పాల్గొనేలా చర్యలు చేపడుతోంది. 2022-24 సంవత్సరాల మధ్య జిల్లాలో 9 మెగా జాబ్‌మేళాలు, 13 మినీ జాబ్‌మేళాలు నిర్వహించి ఎంతోమంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించింది. దీంతోపాటు కేంద్ర ప్రభుత్వం సహకారంతో ప్రధాన మంత్రి కౌసల్య వికాస యోజన(పీఎంకేవీవై) కింద కూడా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తోంది.



జి.మాడుగుల మండలానికి చెందిన కొర్రా రమ్య డిగ్రీ వరకు చదువుకుంది. పేద కుటుంబానికి చెందిన వీరికి ఎలాంటి నెలసరి ఆదాయం లేదు. ఐదుగురు సభ్యులు గల ఈ కుటుంబం ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనేది. స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ గురించి తెలుసుకున్న రమ్య అరకులోని స్కిల్ కళాశాలలో శిక్షణ తీసుకుంది. తిరుపతిలోని ఫార్చ్యూన్ కెన్సెస్ సంస్థలో ఫుడ్ అవుట్‌లెట్ మేనేజర్‌గా రూ.15 వేల వేతనంతో ఉద్యోగం సంపాదించింది.



జాబ్‌మేళా ద్వారా నియామక పత్రాలు పొందిన యువకులు

నియామకాలు ఇలా..

జిల్లాలో నిర్వహించిన జాబ్‌మేళాల్లో ఐదువేల మంది నిరుద్యోగ యువత పాల్గొనగా 1,600 మందికి వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు లభించాయి. అరకులోని స్కిల్ కళాశాలలో 150 మందికి శిక్షణ ప్రారంభించగా ఇప్పటికే 81 మందికి ఉద్యోగాలు లభించాయి. మిగతావారు ఇంకా శిక్షణ పొందుతున్నారు. ప్రధానమంత్రి కౌశల్య వికాస యోజన కింద 513 మందికి శిక్షణ ప్రారంభించగా 268 మందికి ఉద్యోగాలు లభించగా, మిగతావారు శిక్షణ పొందుతున్నారు. స్కిల్‌హబ్‌ల ద్వారా ఇప్పటివరకు 107 మంది నిరుద్యోగులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు పొందారు.

ఆనందంగా ఉంది



మారుమూల గ్రామంలో ఉంటున్న నాకు ప్రభుత్వ చొరవతో ఉద్యోగం రావడం ఎంతో ఆనందంగా ఉంది. నర్సింగ్ చేసిన నాకు విశాఖపట్నంలోని మదర్ అండ్ ఫాదర్ హోం నర్సింగ్ సర్వీసెస్ సంస్థలో రూ.16 వేల వేతనంతో ఉద్యోగం లభించింది.

– జాటోతు పావని, బూరుగువాయి, ఎటపాక మండలం

నైపుణ్య శిక్షణతో ఎంతో ఉపయోగం



అరకులోని స్కిల్ కళాశాలలో పొందిన నైపుణ్య శిక్షణ ఉపాధికి ఎంతగానో దోహదపడింది. దీనిద్వారా తిరుపతిలో ఉద్యోగం సంపాదించాను. నా ఉద్యోగం నా కుటుంబ పోషణకు ఎంతో మేలు చేకూరుస్తోంది.

– మజ్జి విజయ్‌కుమార్, అరకు

సద్వినియోగం చేసుకోవాలి



నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోంది. స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాల ద్వారా యువతకు ప్రత్యేకంగా శిక్షణనిచ్చి ఉద్యోగాలు కల్పించేందుకు ప్రయత్నిస్తున్నాం. జాబ్‌మేళాల ద్వారా కూడా వివిధ కంపెనీలను పిలిపించి ఉపాధి కల్పిస్తున్నాం. జిల్లాలోని నిరుద్యోగ యువత వీటిని సద్వినియోగం చేసుకుంటే ఆర్థిక ఇబ్బందులు తొలగుతాయి.

– ప్రశాంత్‌కుమార్, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారి

ప్రైవేట్ స్కూళ్లలో పేదలకు 25శాతం ఉచిత సీట్లు

- డీఈవో బ్రహ్మాజీరావు
- ఒకటో తరగతిలో ప్రవేశాలకు షెడ్యూల్

సాక్షి,పాడేరు: విద్యాహక్కు చట్టం ప్రకారం పేద విద్యార్థులకు ప్రైవేట్,కార్పొరేట్ పాఠశాలల్లో 25శాతం సీట్లు ఉచితంగా కేటాయించనున్నామని డీఈవో బ్రహ్మాజీరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఒకటోవ తరగతిలో ప్రవేశాలకు షెడ్యూల్ విడుదలైందని పేర్కొన్నారు. ఐబీ, ఐసీఎస్ఈ, సీబీఎస్సీ, స్టేట్‌సిలబస్ అమలవుతున్న ప్రైవేట్,ఎయిడెడ్,కార్పొరేట్ పాఠశాలల్లో 25శాతం సీట్లు పేద పిల్లలకు ఉచితంగా కేటాయిస్తున్నట్టు తెలిపారు. ఈమేరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైందని, ఈనెల 25వరకు గడువు పొడిగించిందని పేర్కొన్నారు. హెచ్‌ఐవీ బాధితులు, దివ్యాంగులకు 5 శాతం,ఎస్సీలకు 10 శాతం, ఎస్టీల కు 4 శాతం, వెనుకబడిన సమూహాలు(బీసీ,మైనార్టీ,ఓసీ)లకు 6శాతం సీట్లు కేటాయించినట్టు తెలిపారు. రూరల్ ఏరియాలో సంవత్సర ఆదాయం రూ.1.20 లక్షలు, అర్బన్ ఏరియాలో రూ.1.44లక్షల ఆదాయానికి లోబడిన కుటుంబాల విద్యార్థులు ఈ ఉచిత సీట్లకు అర్హులు. cre.ap.gov.inవెబ్‌సైట్‌లో విద్యార్థులు వివరాలను నమోదు చేయాలి. దరఖాస్తు సమయంలో విద్యార్థుల తల్లిదండ్రుల గుర్తింపు కార్డులు జతచేయాలి. ఏప్రిల్ ఒకటోవ తేదీన లాటరీ ద్వారా అర్హులైన విద్యార్థుల తొలిజాబితా విడుదల చేస్తామని, ఏప్రిల్ 2నుంచి 10వతేదీ వరకు అడ్మిషన్లను ఫైనల్ చేసి, ఏప్రిల్ 15న లాటరీ ద్వారా రెండవ లిస్టను ప్రకటిస్తామని డీఈవో తెలిపారు.ఏప్రిల్ 16నుంచి 23వతేదీ వరకు ఆయా ప్రైవేట్ పాఠశాలల్లో అడ్మిషన్లు ఖరారు చేస్తామని పేర్కొన్నారు. జిల్లాలోని అర్హులైన పేద విద్యార్థుల తల్లిదండ్రులు ఆన్‌లైన్‌లో తమ పిల్లల పేర్లను నమోదు చేసి,నిర్ణీత గడువులోగా దరఖాస్తులు సమర్పించాలన్నారు. మరిన్ని వివరాలకు తమ కార్యాలయం సీఎంవో ప్రకాష్ (ఫోన్ నంబర్ 8985646737)ను సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

వైద్య శిబిరాలతో పేదలకు మేలు

ఐటీడీఏ పీవో కావూరి చైతన్య

చింతూరు: కార్పొరేట్ ఆస్పత్రులు మారుమూల ప్రాంతాల్లో వైద్యశిబిరాలు నిర్వహించడం వల్ల ఆ ప్రాంత పేద ప్రజలకు ఎంతోమేలు జరుగుతుందని చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం మెడ్ యునైటెడ్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సందర్శించిన పీవో మాట్లాడుతూ వైద్యశిబిరాల ద్వారా మారుమూల గ్రామాల రోగులకు వైద్యసేవలు అందించడం అభినందనీయమని తెలిపారు. ఉచితంగా రక్త తదితర పరీక్షలు నిర్వహించడంతో పాటు మందులు ఇవ్వడంతో రోగులకు ఆర్థికభారం తగ్గుతుందని చెప్పారు. ఈ ప్రాంతంలో మరిన్ని వైద్యశిబిరాలు నిర్వహించేందుకు ప్రోత్సాహం అందిస్తామని పీవో చెప్పారు. ఈ వైద్య శిబిరంలో 500 మందికి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పుల్లయ్య, కల్యాణ్‌వర్మ, డాక్టర్ సురేష్, డాక్టర్ ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.



వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న పీవో చైతన్య

ఆర్టీసీ సమ్మర్ ఆఫర్!

- దూర ప్రాంతాలకు రాను పోను టికెట్లపై రాయితీ
- ముందస్తు రిజర్వేషన్‌తో చార్జీలో 10 శాతం తగ్గింపు
- గతంలో ఒకవైపు ప్రయాణానికే ఈ సబ్సిడీ
- వేసవి ముగిసే వరకు ఈ సదుపాయం వర్తింపు



సాక్షి, విశాఖపట్నం: ఆర్టీసీ ఈ వేసవిలో ప్రయాణికులకు ఊరటనిచ్చే ఆఫర్ ఇస్తోంది. దూర ప్రాంతాలకు వెళ్లే వారికి రాను పోను ప్రయాణ టికెట్లపై రాయితీని ప్రకటించింది. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లడానికి, అటు నుంచి తిరిగి రావడానికి ముందస్తు రిజర్వేషన్ చేయించుకునే వారికి ఈ వెసులుబాటు కల్పించింది. గతంలో రాను పోను ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేస్తే తిరుగు ప్రయాణం టికెట్ చార్జీలో 10 శాతం రాయితీ ఇచ్చేవారు. ఇప్పుడు అలా కాకుండా రెండు వైపులా చార్జీలో 10 శాతం తగ్గింపు ఉంటుంది. ఉదాహరణకు విశాఖపట్నం నుంచి రాజమండ్రికి సూపర్ లగ్జరీ టికెట్ ధర రూ.400 ఉందనుకుంటే ఇటు నుంచి టికెట్‌లో 10 శాతం, అటు నుంచి టికెట్ చార్జీలో మరో 10 శాతం రాయితీ లభిస్తుంది. ఈ లెక్కన రెండు వైపులా ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తే రూ.80 (రూ.40+40) రాయితీ పొందుతారు. సాధారణంగా వేసవి సీజనులో ప్రయాణాలు అధికంగా ఉంటాయి. విద్యార్థులకు సమ్మర్ సెలవులతో పాటు పెళ్లిళ్ల సీజను కూడా కావడంతో దూరప్రాంతాలకు ప్రయాణించే వారు పెద్ద సంఖ్యలో ఉంటారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ అధికారులు అదనపు బస్సులను సమకూరుస్తుంటారు. ఈసారి వేసవిలో రాను పోను రిజర్వేషన్ చేయించుకున్న ప్రయాణికుల కోసం ఆర్టీసీ రాయితీ వెసులుబాటును కల్పించింది. ఇది ప్రయాణికులకు ఒకింత ఉపశమనం కలిగించనుంది. వేసవి ముగిసే దాకా ఈ సదుపాయం కొనసాగనుంది. రైలులో ప్రయాణించేవారు తమ గమ్యస్థానాలకు వెళ్లి రావడానికి ముందస్తుగా రిజర్వేషన్ చేయించుకుంటున్నారు. ఇప్పుడు ఆర్టీసీలోనూ అదే తరహా సదుపాయం అందుబాటులోకి వచ్చింది. అయితే రైల్వేలో రాను పోను రిజర్వేషన్ చేయించుకున్నా టికెట్ చార్జీలో ఎలాంటి తగ్గింపు ఉండదు. కానీ ఆర్టీసీలో 10 శాతం రాయితీ ఇస్తుండడం విశేషం! ఆర్టీసీ కల్పిస్తున్న ఈ సదుపాయాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని విశాఖపట్నం జిల్లా ప్రజా రవాణా అధికారి (డీపీటీవో) ఎ.అప్పలరాజు కోరారు.

నేడు వైఎస్సార్‌సీపీ రోడ్‌షో

ఎటపాక: రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత బాబు ఆధ్వర్యంలో సోమవారం వైఎస్సార్‌సీపీ రోడ్‌షో నిర్వహించనున్నారు. అడుగడుగునా నేతలకు ఘనస్వాగతం పలికేందుకు రహదారుల వెంట పార్టీ జెండాలు, ఫ్లెక్సీలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 2.30 గంటలకు నెల్లిపాకలో రోడ్‌షో ప్రారంభమై సాయంత్రం 4గంటలకు తోటపల్లి, 5గంటలకు గన్నవరంలోని ధర్మయ్య సెంటర్‌కు చేరుకుంటుంది. అనంతరం గౌరిదేవిపేట, గన్నేరుకొయ్యపాడు మీదుగా నందిగామ 6 గంటలకు చేరుకుంటుందని వైఎస్సార్‌సీపీ మండల కమిటీ సభ్యులు పేర్కొన్నారు. యాత్రను విజయవంతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.



రోడ్‌షోకు గౌరిదేవిపేటలో జెండాలు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్న కార్యకర్తలు

కోర్కెలు తీర్చే కల్పవల్లి గంగమ్మతల్లి

- నేటి నుంచి సుజనకోట గంగమ్మ తల్లి ఉత్సవాలు
- 11న అమ్మవారి జాతర, 12న ప్రత్యేక పూజలు
- సరిహద్దు గ్రామాల నుంచి భారీగా తరలి రానున్న భక్తులు

ముంచంగిపుట్టు: మండలంలోని పాత సుజనకోట గ్రామంలో మత్స్యగెడ్డ ఒడ్డున వెలసిన గంగమ్మతల్లి ఉత్సవాలను ఈ నెల 11,12 తేదీల్లో ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఉత్సవ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా కొలువైన గంగమ్మ తల్లికి ఏటా గిరిజన సంప్రదాయం ప్రకారం ఉత్సవాలు నిర్వహిస్తారు. 11వ తేదీ రాత్రి అమ్మవారికి ఘటాలు సమర్పించి, బుడియాలు విన్యాసాలు చేస్తారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి జాతర నిర్వహిస్తారు. 12వ తేదీ తెల్లవారుజామునుంచి భక్తులు మొక్కులు తీర్చుకుంటారు. ఈ గ్రామానికి చెందిన వారు ఎక్కువగా విశాఖ, ఇతర ప్రాంతాల్లో స్థిరపడ్డారు. ఏటా జరిగే ఈ ఉత్సవాలకు వారు ఆర్థిక సహాయం అందించడంతో పాటు కుటుంబసమేతంగా వచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు. ఉత్సవాల సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్ది, విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. స్థానిక సర్పంచ్ వెంగడ రమేష్, ఉత్సవ కమిటీ అధ్యక్ష,కార్యదర్శులు సమరెడ్డి శంకర్‌రావు, వెంగడ నీలకంతం, కమిటీ సభ్యులు ఆదివారం ఏర్పాట్లను పర్యవేక్షించారు.



సుజనకోటలో కొలువైన గంగమ్మతల్లి



ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

బుడియా మాలతో సందడి

గంగమ్మతల్లి మొక్కుబడుల్లో భాగంగా అధిక సంఖ్యలో గిరిజనులు బుడియా మాల ధరిస్తారు. ప్యాంట్ మాత్రమే ధరించి, శరీరం అంతా తెల్లటి సున్నంతో చారలుగా రాసుకొని, కర్రలతో విన్యాసాలు చేస్తారు. ఈ బుడియా మాలను ప్రతి ఏటా వందలాది మంది ధరిస్తారు. ఉన్నత స్థాయి ఉద్యోగులు మొదలు ఎంతో మంది బుడియా మాల ధరించి, గ్రామాల్లో తిరుగుతూ పాటలు పడుతూ గంగమ్మతల్లి పండగపై ప్రచారం నిర్వహిస్తారు. గ్రామాల్లో డబ్బులు,బియ్యం,కూరగాయలు సేకరిస్తారు. ఇలా సేకరించిన బియ్యం,కూరగాయలతో వంట చేసి సహపంక్తి భోజనాలు చేస్తారు. గంగమ్మ తల్లి ఉత్సవాల ప్రారంభం నుంచి పూర్తయ్యేవరకు బుడియాలు ముఖ్యపాత్ర పోషిస్తారు.

ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



గంగమ్మతల్లి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశాం. ఆలయం వద్ద భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నాం. ఉత్సవాల్లో విధులు నిర్వహించేందుకు పోలీసు,రెవెన్యూశాఖలతో పాటు పలు శాఖల సిబ్బందిని ఉన్నతాధికారులు నియమించారు. ఆలయానికి వెళ్లే కొండ ప్రాంతంలో దారిపొడువునా విద్యుత్ సౌకర్యం కల్పించాం. 20వేల మందికి పైగా భక్తులు సరిహద్దు గ్రామాల నుంచి భక్తులు వస్తారని అంచనా వేస్తున్నాం.పార్కింగ్ సమస్య లేకుండా ప్రత్యేక స్థలం కేటాయించాం.

– సమరెడ్డి శంకర్‌రావు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, సుజనకోట

ఉత్సాహంగా మహిళా మారథాన్



జుంబా డ్యాన్స్ వేస్తున్న మహిళలు



మారథాన్‌లో పాల్గొన్న మహిళలు

బీచ్‌రోడ్డు(విశాఖ): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ (జేసీఐ) ఆధ్వర్యంలో బీచ్ రోడ్డులో ఆదివారం ఉదయం 'మహిళా మారథాన్' ఉత్సాహంగా సాగింది. 21కె, 10కె, 5కె, 3కె విభాగాల్లో నిర్వహించిన మారథాన్‌లో 40 కేటగిరీల్లో విజేతలను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. ఈ మారథాన్‌లో పాల్గొన్న వారిని ఉత్సాహపరిచేందుకు జుంబా డ్యాన్స్‌లు చేశారు. చిన్న పిల్లలు, యువతలు, వృద్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

క్లుప్తంగా

పాముకాటుతో మహిళ మృతి



అడ్డతీగల సీహెచ్‌సీలో చికిత్స పొందుతూ మృతి చెందిన కోసూరి ఏగులమ్మ



స్థానికుల చేతిలో హతమైన పాము

అడ్డతీగల: మండలంలోని తిమ్మాపురంలో మధ్యాహ్న భోజన కార్మికురాలు కోసూరి ఏగులమ్మ(62) పాముకాటుతో మృతి చెందింది. ఆదివారం ఆమె ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వద్ద పాముకాటుకు గురై అపస్మారక స్థితిలోకి వెళ్లింది. స్థానికులు అడ్డతీగల సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మరణించినట్టు మండల వ్యవసాయ సలహా కమిటీ సభ్యులు,వైఎస్సార్‌సీపీ నాయకుడు గంగ తెలిపారు. ఆమెను కాటేసిన పామును గ్రామస్తులు హతమార్చారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశ పరీక్షలు ప్రశాంతం

చీడికాడ : మండలంలోని కోనాం డా.బి.ఆర్.అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో గురుకుల పాఠశాలల 5వ తరగతి, ఇంటర్ ప్రవేశ పరీక్ష ఈససీ కెమేరాల నడుమ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 5లో ప్రవేశపరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు 362 మంది హాజరు కావల్సి ఉండగా 53 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 2గంటల నుంచి 4.30 గంటల వరకు ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశ పరీక్షకు 169 మందికి 13 మంది గైర్హాజరైనట్టు ప్రిన్సిపాల్ సిహెచ్. హిమాచల తెలిపారు.

కోడి పందాలపై దాడి

మారేడుమిల్లి: మండలంలోని దొరచింతలపాలెంలో కోడి పందాలు నిర్వహిస్తున్న వారిపై సీఐ రుద్రరాజు, ఎస్ఐ రాములు సిబ్బందితో కలిసి దాడి చేశారు. కోడిపందేలు ఆడుతున్న పది మందిని అరెస్టు చేసినట్టు సీఐ తెలిపారు. వారి నుంచి రూ. 26 వేల నగదు, నాలుగు కోళ్లు, మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

భక్తి విశేషం.. వినూత్న సంప్రదాయం

- రాజయ్యపేటలో భక్తిశ్రద్ధలతో నూకతాత పండగ
- రోడ్డుపై పడుకుని మొక్కు చెల్లించుకున్న భక్తులు



నూకతాత విగ్రహాన్ని నెత్తిన పెట్టుకుని ఆశీస్సులు తీసుకుంటున్న సమన్వయకర్త, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు



మొక్కు చెల్లించుకునేందుకు రోడ్డుపై పడుకున్న గంగపుత్రులు

నక్కపల్లి : వింత ఆచారం, వినూత్న సంప్రదాయంతో ఆసక్తి కలిగించే నూకతాత పండగను ఆదివారం మత్స్యకారులు భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. మత్స్యకారులు అధికంగా ఉండే రాజయ్యపేటలో ఈ పండగను తరతరాలుగా నిర్వహిస్తున్నారు. ప్రతి ఏటా మహాశివరాత్రి అమావాస్య మరుసటిరోజు రాజయ్యపేటలో ఈ నూకతాత పండగ జరుగుతుంది. నూకతాతను గంగపుత్రులు తమ కులదైవంగా, ఆరాధ్య దైవంగా భావిస్తారు. పండగ సందర్భంగా దూర ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా రాజయ్యపేట చేరుకున్నారు. బంధువులు, స్నేహితుల రాకతో గంగపుత్రుల ఇళ్లన్నీ కళకళలాడాయి. ఆదివారం నూకతాత విగ్రహాలను సముద్రస్నానానికి తీసుకెళ్లారు. తిరిగి ఆలయానికి విగ్రహాలను తీసుకొచ్చే సమయంలో భక్తులు రోడ్డుపై పడుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఇలా రోడ్డుపై పడుకున్న భక్తులపై నుంచి విగ్రహాలను చేతపట్టిన పూజారులు దాటుకుంటూ వెళ్లారు. ఇలా మొక్కు చెల్లించుకుంటే నూకతాత అనుగ్రహం తమపై ఎల్లవేళలా ఉంటుందని, కోరిన కోర్కెలు నెరవేరుతాయని గంగపుత్రుల నమ్మకం. నూకతాత పండుగలో కోళ్లు, మేకలు బలి ఇవ్వడం నిషేధం. రక్తం చిందించడాన్ని నూకతాత ఒప్పుకోడని మత్స్యకారులు చెబుతారు. పండుగను పురస్కరించుకుని గ్రామంలో పెద్ద తిరునాళ్ల జరిగింది. భారీ విద్యుదలంకరణలు ఏర్పాటు చేశారు. బాణాసంచాల సంబరాలు మిన్నంటాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు విస్తృత బందోబస్తు ఏర్పాటు చేశారు. నూకతాత ఆలయాన్ని పాయకరావుపేట సమన్వయకర్త, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, జెడ్పీటీసీ గోసల కాసులమ్మ, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, మండల పార్టీ అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి దర్శించుకున్నారు. కంబాల జోగులు నూకతాత విగ్రహాలను నెత్తిన పెట్టుకుని ఆశీస్సులు తీసుకున్నారు. ఎమ్మెల్యే వెంట పార్టీ నాయకులు ఎరిపల్లి నాగేశు, యలమంచిలి తాతబాబు, సూరాకాసుల గోవిందు, బొల్లంబాబ్జి, గొర్ల బాబూరావు, శేషారత్నం పాల్గొన్నారు.

కల సాకారమైన వేళ



పెదలువ్వాసింగి పంచాయతీ అలగాం గెడ్డపై నిర్మించిన వంతెన

- ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి చొరవతో అలగాం బ్రిడ్జి నిర్మాణం
- 28 గ్రామాల ప్రజల రాకపోకలకు మార్గం సుగమం
- గ్రామస్తుల హర్షం

జి.మాడుగుల: గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మన్యంలో ఏ ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదు. గ్రామాల్లో కనీస మౌలిక సదుపాయాలైన రహదారులు, తాగునీటి సదుపాయం వంటి పనులను పాలకులు చేపట్టలేదు. దీంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మన్య ప్రాంత అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఏజెన్సీలో శివారు గ్రామాల్లోనూ రహదారులు, తాగునీటి సదుపాయం, డ్రైనేజీలు, వంతెనలు తదితర పనులకు కోట్లాది రూపాయలను మంజూరు చేశారు. దీంతో గిరిజనుల దశాబ్దాల రహదారుల కల వైఎస్సార్‌ సీపీ పాలనలో సాకారమైంది.

బ్రిడ్జి నిర్మాణానికి రూ.1.95కోట్ల నిధులు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామాల్లో రోడ్ల అభివృద్ధి గెడ్డల వంతెనల నిర్మాణం జరుగుతుండడంతో గిరిజన ప్రాంత ప్రజలు ఆనందం వ్యక్త చేస్తున్నారు. జి.మాడుగుల మండలంలో లువ్వాసింగి పంచాయతీలో పలు గ్రామాల్లో తారురోడ్లు, సీసీ రోడ్లు గెడ్డలపై వంతెనలపై వంటి అభివృద్ధి చేపట్టారు. ఇందులో భాగంగా మండలంలోని లువ్వాసింగి పంచాయతీలో అలగాం గెడ్డపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.1.95కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ వంతెన వల్ల సుమారు 28 గ్రామాల ప్రజలకు మార్గం సుగమమైంది. ఈ ప్రాంతంలో వంతెన కోసం స్థానికులు పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మిని కోరారు. ఈ విషయాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి ఎమ్మెల్యే తీసుకెళ్లడంతో తక్షణమే స్పందించి నిధులు మంజూరు చేశారు. శరవేగంగా బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తికావడంతో గిరిజనులు రవాణా సౌకర్యం ఏర్పడిందని ఎంపీటీసీ సభ్యుడు గబ్బాడి సన్యాసిదొర తెలిపారు. పంచాయతీలో మారుమూల గ్రామాలకు రూ.2.40కోట్లు జీఎస్‌బి రోడ్లు, సీసీ రోడ్లు నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. తమ గ్రామాల్లో రోడ్డు, వంతెన నిర్మాణాలు జరగడంతో స్థానికులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

గిరిజన ప్రజాసంఘాల బంద్ ప్రశాంతం



పాడేరులో రోడ్డుపై ఆందోళన చేస్తున్న గిరిజన ప్రజా సంఘాల నేతలు

సాక్షి,పాడేరు: జీవో నంబర్ 3 పునరుద్ధరణ, ప్రత్యేక ఆర్డినెన్స్‌తో నూరుశాతం ఉద్యోగాలు గిరిజనులతోనే భర్తీ చేయాలని, గిరిజనులకు ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని, భాషా పండితులను రెన్యూవల్ చేయాలన్న డిమాండ్లతో ఆదివారం గిరిజన ప్రజా సంఘాలు చేపట్టిన మన్యం బంద్ ప్రశాంతంగా జరిగింది. పాడేరులో గిరిజన సంఘం, సీపీఎం, సీపీఐ, ఆదివాసీ జేఏసీ, గిరిజన విద్యార్థి సంఘం నేతలు రోడ్డుపై బైఠాయించి వాహనాల రాకపోకలను అడ్డుకునే ప్రయత్నం చేశారు. పోలీసులు, స్థానిక ప్రజల విజ్ఞప్తితో ఆందోళనకారులు శాంతించారు. పాడేరు డిపో నుంచి ఆర్టీసీబస్సులు, ప్రైవేట్ వాహనాలు ఏజెన్సీతో పాటు మైదాన ప్రాంతానికి యథావిధిగా నడిచాయి. చింతూరు,రంపచోడవరం ప్రాంతాల్లో కూడా రాజమండ్రి, కాకినాడ, గోకవరం, ఏలేశ్వరం డిపోలకు చెందిన ఆర్టీసీ బస్సులు నడిచాయి. పాడేరుతో పాటు పలు మండలాల్లో వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలను మూసివేశారు. అనంతగిరి మండలంలోని బొర్రాగుహలు,అరకులోయ, దుంబ్రిగుడ మండలాల్లో పర్యాటక ప్రాంతాలు మూతపడ్డాయి. పెదబయలులో ఆందోళనకారులు రోడ్డుపై వంటావార్పుతో నిరసన తెలిపారు.పాడేరులో గిరిజన సంఘం,సీపీఐ నేతలు సుందరరావు, కూడా రాధాకృష్ణలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గిరిజన సమస్యలను పరిష్కరించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు



గాయపడిన వారిని అంబులెన్స్‌లో పాడేరు ఏరియా ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

చింతపల్లిరూరల్: మండలంలోని లోతుగెడ్డ, అన్నవరం మధ్య ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. లోతుగెడ్డ గ్రామానికి చెందిన మువ్వల మహేష్, పల్లిబోయిన రోహిత్ ద్విచక్ర వాహనంపై లోతుగెడ్డ నుంచి అన్నవరం వెళ్తూ మార్గ మధ్యంలో ఎదురుగా వస్తున్న వ్యాన్‌ను ఢీకొన్నారు. ఈ సంఘటనలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి.వీరికి లోతుగెడ్డ పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం చింతపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు.అక్కడి నుంచి పాడేరు ఆస్పత్రికి తీసుకెళ్లారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



నిత్యకల్యాణంలో జీలకర్రబెల్లం ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్టింపజేసి 108 స్వర్ణసంపెంగలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అర్చకులు శ్రావణ్ తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

వైభవంగా నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణమండపంలో వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు.

శేషుకొండ కాలనీలో చోరీ



చోరీ జరిగిన ఇంట్లో చిందర వందరగా పడిన దుస్తులు

యలమంచిలి రూరల్ : పట్టణానికి సమీపంలో శేషుకొండ కాలనీలో కిరాణా దుకాణంలో పని చేసే కొంకోట శంకర్రావు ఇంట్లో శనివారం రాత్రి చోరీ జరిగింది. కుటుంబ సభ్యులంతా ఇంటి ముందు ఉండగానే వారికి తెలిసిన యువకుడు ఇంట్లోకి చొరబడి రూ. 20 వేల నగదు అపహరించుకుపోయాడు. బీరువా పగులగొట్టేందుకు యత్నించే లోగా శబ్దాలు విని కుటుంబ సభ్యులు ఇంట్లోకి వెళ్తుండగా సుమారు 16 నుంచి 17 సంవత్సరాల వయసున్న యువకుడు ఇంట్లోంచి బయటికి వచ్చి ఒక్కసారిగా పరారయ్యాడు. అతని కోసం ఎంత వెతికినా ప్రయోజనం లేకపోవడంతో ఆదివారం పట్టణ పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు. చూస్తుండగానే యువకుడు తమ కళ్లు గప్పి ఇంట్లో నగదు దొంగలించుకుపోయాడని, బీరువాలో సీక్రెట్ లాకర్ తెరిచేలోగా తాము ఇంట్లోకి రావడం చూసిన యువకుడు పరారయ్యాడని తెలిపారు. దీనిపై పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

బాలికల పాఠశాలల్లో నిఘా నేత్రం

- 49 బాలికల పాఠశాలల్లో సీసీ కెమేరాల ఏర్పాటు
- 17 వేల మంది బాలికల భద్రతకు భరోసా
- ఒక్కో పాఠశాలలో పది కెమేరాల ఏర్పాటు



కంప్యూటర్‌లో సీసీ కెమేరా దృశ్యాలు చూపుతున్న హెచ్‌ఎం గోపాలం

కొయ్యూరు: బాలికల పాఠశాలల్లో సీసీ కెమేరాలను ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. బాలికల ప్రత్యేక రక్షణను దృష్టిలో పెట్టుకున్న ప్రభుత్వం వాటిని ఏర్పాటు చేసింది. ఒక్కో పాఠశాలలో పది సీసీ కెమెరాలు ఏర్పాటుచేస్తున్నారు. ఇందులో భాగంగా పాఠశాల ప్రహరీ వద్ద, ప్రధాన గేటు, పాఠశాల ఆవరణలో, కారిడార్ ఇతరత్రా ప్రదేశాల్లో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలను మెయిన్ నెట్‌వర్క్ ద్వారా కంప్యూటర్‌కు అనుసంధానం చేస్తారు. పాఠశాలలో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలన్నీ కంప్యూటర్ ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తారు. దీంతో పాఠశాలల ప్రాంగణాల్లో ఆకతాయిల ఆగడాల నుంచి బాలికలకు ప్రత్యేక రక్షణ కలుగుతందని పలువురు చెబుతున్నారు. పాఠశాలల్లో బాలికల రక్షణ, భద్రతకు ప్రభుత్వం తీసుకున్న చర్యలపై విద్యార్థినుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రక్రియ పూర్తయింది



బాలికల పాఠశాలల్లో సీసీ కెమేరాల ఏర్పాటు ప్రక్రియ పూర్తయింది.దీంతో బాలికలకు మరింత భద్రత పెరగనుంది. పాఠశాలల్లో బాలికల భద్రతపై పూర్తి నిఘా ఉంటుంది. పాఠశాలలో బయట వ్యక్తుల ప్రవేశం లేకుండా వీలు కలుగుతుంది. నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుంది. – కొండలరావు, డీడీ, గిరిజన సంక్షేమ శాఖ, పాడేరు

భర్త అడుగుజాడల్లో..

- కళ్లు, పార్థివదేహం దానం



శాస్త్రి, రమాదేవి(ఫైల్)

సీతమ్మధార: సీతమ్మధారకు చెందిన కె.వి.రమాదేవి(82) భర్త అడుగుజాడల్లో నడిచారు. మరణంలోనూ మహోపకారిగా నిలిచారు. ఆదివారం తెల్లవారుజామున ఆమె మృతి చెందగా.. రమాదేవి కళ్లను ఎల్.వి.ప్రసాద్ ఆస్పత్రికి, పార్థివ దేహాన్ని సంగివలస ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాలకు కుటుంబసభ్యులు అప్పగించారు. ఆమె భర్త కె.ఆర్.ఎస్.ఎస్.శాస్త్రి 15 ఏళ్ల కిందట సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్‌కు మరణాంతరం తన పార్థివదేహాన్ని దానం చేస్తున్నట్లు అంగీకారం పత్రం రాసి ఇచ్చారు. జైలర్‌గా పనిచేసిన శాస్త్రి ఐదేళ్ల కిందట మరణించగా.. ఆయన కోరిక మేరకు కళ్లను ఎల్.వి.ప్రసాద్ ఐ ఆస్పత్రికి, పార్థివదేహాన్ని ఏఎంసీకి అందజేశారు. అప్పుడే ఆయన సతీమణి కె.వి. రమాదేవి భర్తను ఆదర్శంగా తీసుకుని, అవయవదానానికి ముందుకొచ్చారు. తల్లిదండ్రుల ఆకాంక్షలను వారి బిడ్డలు నెరవేర్చి స్ఫూర్తిగా నిలిచారు. రమాదేవి కుమారుడు కె.శ్రీరామూర్తి, కోడలు లలిత, కుమార్తె ఉమా కామేశ్వరి, అల్లుడు సుబ్రహ్మణ్యంను ఎస్‌పీఈసీటీ ఛైర్‌పర్సన్ సీతామహాలక్ష్మి గూడురు అభినందించారు.

పల్లెల్లో పారామిలటరీ దళాల కవాతు



మార్చ్ చేస్తున్న పారా మిలటరీ దళాలు

చోడవరం రూరల్ : రానున్న ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపడంలో భాగంగా ఎన్నికల కమిషన్ ఆదేశంతో ఆర్మ్‌డ్ రిజర్వు దళాలు ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో కవాతు నిర్వహించారు. మండలంలోని ఖండిపల్లి, గవరవరం, లక్కవరం, జుత్తాడ, సింహాద్రి పురం, గజపతి నగరం, పి.ఎస్.పేట, బంగారమ్మపాలెం, జన్నవరం, కన్నంపాలెం, తిమ్మన్నపాలెం, బెన్నవోలు తదితర గ్రామాల్లో వీధుల్లో కవాతు నిర్వహించి రానున్న ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. చోడవరం సీఐ బి.శ్రీనివాసరావు, ఎస్ఐ సూర్యనారాయణ, ఆర్మ్‌డ్ రిజర్వు ఫోర్స్ ఆర్ఐఓ, పోలీసు సిబ్బంది. సుమారు వందమంది పారా మిలటరీ దళాలు పాల్గొన్నారు.


అప్పులు బాధలు తప్పాయి



వైఎస్సార్ చేయూత పథకం సొమ్ముతో హోటల్ నిర్వహిస్తున్న సుబ్రమణ్యం లక్ష్మి

అనంతగిరి: ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ చేయూత పథకంతో ఎందరో మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకుంటూ కుటుంబాలకు అండగా నిలబడుతున్నారు. ఇందుకు పక్క చిత్రంలో ఉన్న సుబ్రహ్మణ్యం లక్ష్మి స్వయం ఉపాధి బాట ఉదాహరణగా చెప్పవచ్చు. అనంతగిరికి చెందిన లక్ష్మి వైఎస్సార్ చేయూత పథకానికి అర్హురాలు కావడంతో నాలుగు విడతల్లో ప్రభుత్వం ద్వారా రూ.75వేల అందుకుంది. వైఎస్సార్ చేయూత ద్వారా అందిన సొమ్ముతో హోటల్‌ను అభివృద్ధి చేసి జీవనోపాధి పొంది ఆర్థికంగా నిలదొక్కుకుంది. గతంలో సరకులు కొనేందుకు పెట్టుబడి లేక అధిక వడ్డీకి అప్పు తీసుకుని వ్యాపారం చేసేది. వ్యాపారం అంతంతమాత్రంగా ఉండడంతో ఫైనాన్స్ చెల్లించేందుకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చేయూత పథకానికి సుబ్రహ్మణ్యం లక్ష్మి స్థానిక వలంటీర్ ద్వారా దరఖాస్తు చేయడంతో నాలుగు విడతల్లో రూ.75వేలు జమ అయింది. హోటల్ అభివృద్ధికి ఆయా సొమ్మును పెట్టుబడి పెట్టారు. మైదాన ప్రాంతానిక వెళ్లి హోటల్‌కు కావాల్సిన సరుకులు తెచ్చుకుంటోంది. రోజుకు రూ.2వేల నుంచి రూ.4వేల వ్యాపారం జరుగుతుంది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సాయంతో అప్పుల బాధలు తప్పాయని జగనన్నకు మా కుటుంబమంతా రుణపడి ఉంటామని చెబుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



మృతి చెందిన బాలు

గొలుగొండ: రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందగా, మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. అల్లూరి జిల్లా జి. మాడుగుల మండలం కొక్కిరాపల్లి గ్రామానికి చెందిన సాయితో పాటు బాలు అనే యువకుడు బైక్‌పై సొంత గ్రామం వెళ్తున్న సమయంలో గొలుగొండ మండలం రావణాపల్లి వద్ద ఆర్టీసీ బస్ ఢీకొన్న ఘటనలో బాలు దుర్మరణం పాలయ్యాడు. మరో యువకుడు సాయికి తీవ్ర గాయాలయ్యాయి. చింతపల్లి నుండి నర్సీపట్నం వస్తున్న ఆర్టీసీ బస్ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. గొలుగొండ ఎస్ఐ కృష్ణారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ ప్రమాదంలో ఒకరు..

మాకవరపాలెం : మండలంలోని తాడపాలకు చెందిన కలాం అప్పారావు (34) శనివారం రాత్రి సమీప గ్రామమైన మామిడిపాలెంలో జరిగిన పండగకు మోటార్ సైకిల్‌పై వెళ్లాడు. ప్రమాదవశాత్తూ బైక్ బోల్తా కొట్టడంతో అప్పారావు తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో వెంటనే నర్సీపట్నం ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

కల్యాణపులోవ ఆదాయం రూ. 16.47 లక్షలు



ఆదాయం లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది



బ్రహ్మముడులు వేయించుకుని పుణ్యస్నానమాచరిస్తున్న దంపతులు

రావికమతం : కల్యాణపులోవ తిరుణాళ్లు ఆదివారంతో ముగిసాయి. ఈ నెల 8,9,10 తేదీల్లో తిరునాళ్లు జరిగిన సంగతి తెలిసిందే. 8వ తేదీన 90 వేల మంది హాజరు కాగా 9న రెండు లక్షలు, 10వ తేదీన 30 వేల మంది యాత్రికులు తరలి వచ్చినట్లు ఆలయ ఈవో కిరణ్మయి తెలిపారు. మూడో రోజు భక్తులు, దంపతులు వేద పండితులచే బ్రహ్మముడులు వేయించుకుని స్నానమాచరించారన్నారు. భక్తుల ద్వారా ఈ ఏడాది రూ.16,47,081 ఆదాయం సమకూరినట్టు తెలిపారు. హుండీల ద్వారా రూ.8,29,716, తలనీలాలు, కొబ్బరి చిప్పలు, ప్రసాదం ద్వారా రూ.4,41,530, దర్శనం టికెట్ల ద్వారా రూ.3,75,835 ఆదాయం వచ్చిందన్నారు. గత ఏడాది రూ.14,27,901 ఆదాయం రాగా ఈ ఏడాది రెండు లక్షల వరకూ పెరిగిందన్నారు. ఉత్సవ పర్యవేక్షకుడు, సర్పంచ్ వంజరి గంగరాజు, డీసీఎంఎస్ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ పర్యవేక్షణలో 40 మంది శ్రీవారి భక్తులు హుండీలు లెక్కించారు. అలాగే హుండీ ద్వారా వచ్చిన ఆదాయాన్ని కొత్తకోట బ్యాంకులో స్వామి వారి ఖాతాలో జమ చేసినట్టు ఈవో తెలిపారు.